క్లుప్తంగా

పోరంకిలో ఉచిత మందుల పంపిణీ



పెనమలూరు: వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీ పరిధి పోరంకి గ్రామంలో ఆదివారం అనుమోలు ఆదరణ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామంలో ఎమ్మెల్యే బోడెప్రసాద్ ట్రస్టు నిర్వాహకుడు అనుమోలు ప్రభాకరరావు బాధితులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మందుల పంపిణీ కార్యాక్రమం కొనసాగుతుందని ప్రభాకరరావు తెలిపారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో పారిశుద్ధ్య పనులు పంచాయతీ ఆధ్వర్యంలో ముమ్మరంగా సాతున్నాయి. సైడు కాలువల్లో వ్యర్థాలు లేకుండా ఎప్పటికప్పుడు సిబ్బంది తొలగిస్తున్నారు. దోమలు ఉధ్ధృతిని అరికట్టే విధంగా వర్షం నీరు నిల్వ ఉన్న చోట ఆయిల్ బాల్స్ వదులుతున్నారు. తాగునీటి ట్యాంక్‌ల్లో క్లోరినేషన్ చేస్తున్నారు. ఈ చర్యల కారణంగా డయేరియా లక్షణాలు లేకుండా నివారణ చర్యలు చేపడుతున్నట్లు గ్రామ కార్యదర్శి జీటీవీ రమణ తెలిపారు.

రోడ్డును బాగు చేయరూ..



కేసరపల్లి(గన్నవరం): గన్నవరం మండలం కేసరపల్లిలో కంకిపాడుకు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు గోతుల మయంగా మారింది. గ్రామంలోని మూడు రోడ్ల కూడలి నుంచి ఏలూరు కాలువ వంతెన వరకు రోడ్డు పూర్తిగా దెబ్బతింది. రోడ్డుపై భారీగా గుంతలు పడడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీనికితోడు వర్షం నీరు గుంతల్లో చేరి పలుచోట్ల చెరువును తలపిస్తోంది. నీటితో నిండిన గుంతల్లో పడి వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు వెంటనే స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేడు కానూరులో వైఎస్సార్ జయంతి

పెనమలూరు: దివంగత ముఖ్యమంత్రి వైఎస్. రాజశేఖరరెడ్డి జయంతి వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీ పరిధి కానూరు రామాలయం వద్ద సోమవారం నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు జరిగే కార్యక్రమంలో పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త జోగి రమేష్, కమ్మ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవభక్తుని చక్రవర్తి, గ్రామ మాజీ సర్పంచ్ దేవభక్తుని సుబ్బారావు పలువురు నేతలు కార్యకర్తలు పాల్గొంటారు. కాగా నియోజకవర్గ పరిధిలో అన్ని గ్రామాల్లో వైఎస్సార్ జయంతి వేడుకలు నిర్వహించాలని సమన్వయకర్త జోగి రమేష్ కార్యాలయం ఆదివారం ప్రకటనలో తెలిపింది.

బైక్ చోరీపై కేసు నమోదు

పెనమలూరు: కానూరులో విద్యుత్ శాఖ ఉద్యోగి బైక్ చోరీ జరగటంతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు క్రైమ్ పోలీసుల కథనం మేరకు కానూరు విద్యుత్ శాఖ ఈఆర్ఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న జీపీ సుబ్బారావు కానూరులో సిటీ బ్యాంకు సమీపంలో ఉంటున్నాడు. అతను తన బైక్‌ను ఇంటి ముందు పార్కు చేశాడు. గుర్తు తెలియని దొంగలు బైక్ చోరీ చేశారు. ఈ ఘటన పై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్య

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం బొమ్ములూరులో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డారు. స్థానికంగా ఉన్న ఫీడ్స్ ఫ్యాక్టరీలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న పిల్లి వేణుగోపాల్ (25) శనివారం రాత్రి కలుపు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. దీన్ని గుర్తించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన వైద్యుడిని తీసుకొచ్చారు. అప్పటికే వేణుగోపాల్ మృతి చెందాడు. మరో ఘటనలో స్థానిక ఎంజీ నగర్‌లో సాకీర్ (24) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటననపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదులు అందకపోవటంతో కేసులు నమోదు కాలేదు.

ఘనంగా గంగానమ్మ తల్లి జాతర



అమ్మవారిని నీళ్ల బిందెలతో అభిషేకం చేసేందుకు ఆలయం చుట్టూ క్యూ కట్టిన భక్తులు



కన్నుల పండువగా సాగుతున్న గ్రామోత్సవం

కంకిపాడు: మండలంలోని ప్రొద్దుటూరులో వేంచేసిన శ్రీ గంగానమ్మతల్లి జాతర మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. గ్రామ ఆడపడుచులు నీళ్ల బిందెలతో అమ్మవారికి అభిషేకం చేసి ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం భక్తులు గ్రామోత్సవాన్ని చేపట్టారు. గ్రామోత్సవంలో తరలిస్తున్న అమ్మవారికి, పోతురాజుకు భక్తులు పసుపునీరు ఓరబోసి, పసుపు కుంకుమలు సమర్పించారు. సాయంత్రం నుంచి ఆలయం వద్ద మొక్కులు తీర్చేకునేందుకు భక్తులు తరలి వచ్చారు. గ్రామోత్సవంలో భేతాళ నృత్యాలు, డప్పు కళాకారుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గ్రామోత్సవాన్ని ఉత్సవ కమిటీ పర్యవేక్షించింది.



అలరించిన భేతాళ నృత్యాలు

శ్రీలక్ష్మీతిరుపతమ్మకు ఆషాఢ సారె సమర్పణ

గన్నవరం: స్థానిక పాతగన్నవరంలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో ఆషాఢ మాసం తొలి ఆదివారం సందర్భంగా భక్తులు సారెను సమర్పించారు. తొలుత అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు, మహిళల కోలాట నృత్య ప్రదర్శనతో గ్రామోత్సవం నిర్వహించారు.

అనంతరం ఆలయానికి చేరుకున్న భక్తులు అమ్మవారికి ఆషాఢ సారెను, గ్రామపొంగళ్లు, పలు రకాల నైవేద్యాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని మాను(మహాలక్ష్మీ)కి పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీలక్ష్మీతిరుపతమ్మ సన్నిధిలో భక్తులు శ్రీలలిత సహస్రనామ పారాయణం, లక్ష్మీ అష్టోత్తరం జరిపారు. ఆలయంలోని ఉపదేవత శ్రీఅంకమ్మ తల్లికి ఆషాఢ భోనం సమర్పించారు. అమ్మవారిని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు దంపతులు, మాజీ ఎమ్మెల్యే దాసరి వెంకటబాలవర్ధనరావు, పలువురు గ్రామ ప్రముఖులు దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిపారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



పూజ కార్యక్రమంలో పాల్గొన్న యార్లగడ్డ, దాసరి



ఆషాఢ సారెతో వెళుతున్న భక్తులు

పెదపులిపాకలో..

పెనమలూరు: పెదపులిపాక గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ విజయరాజరాజేశ్వరి శ్రీవిజయసుందరేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢ మాసం ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి సారె సమర్పించారు. పసుపు, కుంకుమ, చీర, పూలు, పండ్లు, గోరింటాకు, గాజులు, చలివిడి, స్వీట్లు అమ్మవారికి సమర్పించారు. శ్రీ వాసుదేవానందగిరి స్వామీజీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.



పులిపాకలో అమ్మవారికి ఆషాఢ సారె సమర్పిస్తున్న భక్తులు

కార్మెల్‌మాత మహోత్సవాలు ప్రారంభం



పెనమలూరు: కానూరు కార్మెల్‌మాత పుణ్యక్షేత్రం మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభించారు. విచారణ గురువు ఫాదర్ సలివేంద్రశౌరి ప్రారంభించారు. ముందుగా ప్రావిషనల్ సుపీరియర్ ఫాదర్ వెలుతురు అమృతరాజు కార్మెల్‌మాత పతాకావిష్కరణ చేశారు. దివ్య బలి పూజలు నిర్వహించారు. ఫాదర్లు రత్నరాజు, దేవదానం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నెల 16వ తేదీ వరకు కార్మెల్‌మాత మహోత్సవాలు జరుపుతారు. కార్యక్రమంలో కౌన్సిల్ ఉపదేశకులు, సీటీసీ సిస్టర్స్, గాయక బృందం, యూనిట్స్ సభ్యులు, గంగూరు, పోరంకి, సాలిపేట, కామయ్యతోపు, కానూరు భక్తులు పాల్గొన్నారు.

'దుర్గా' డిపాజిట్లు చెల్లించేలా చర్యలు తీసుకోవాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ వన్‌టౌన్‌లోని దుర్గా కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్‌లో డిపాజిట్ చేసిన సొమ్మును తక్షణమే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిపాజిట్‌దారులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్, జిల్లా సహకార బ్యాంక్ రిజిస్ట్రార్‌కు మెమరాండం సమర్పించాలని బాధితులు నిర్ణయించారు. పశ్చిమ నియోజకవర్గంలోని కేదారేశ్వరపేటలో గల ఒక పాఠశాలలో ఆదివారం బాధిత డిపాజిట్‌దార్ల సమావేశం జరిగింది. పి.స్వామి చరణ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తొమ్మిది దశాబ్దాలకు పైగా చరిత్ర కలిగిన దుర్గా కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ కోట్లాది రూపాయల డిపాజిట్లను సేకరించిన బ్యాంక్ పాలకవర్గం దానిని దివాలా దిశగా తీసుకువెళ్లిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత రెండేళ్లుగా డిపాజిట్ల కాలపరిమితి ముగిసినా తిరిగి చెల్లించకుండా ఆర్‌బీఐ నిబంధనల పేరుతో కాలయాపన చేయటం దుర్మార్గమన్నారు. గత రెండేళ్ల నుంచి వసూలు చేసిన మొండి బకాయిల నుంచి అయినా తమ డిపాజిట్లు చెల్లించాలని కోరారు. డిపాజిట్‌దారులలో అత్యధిక శాతం మంది వృద్ధులు, వితంతువులు, రిటైరైన ఉద్యోగులు ఉన్నారని, వారు వైద్యం చేయించేకునేందుకుకూడా డబ్బులు లేక నానా అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే పిల్లల పెళ్లిళ్ల కోసం డిపాజిట్ చేసిన సొమ్ము తిరిగి ఇవ్వకపోవడంతో వారు తీవ్ర ఆందోళన చెందుతున్నామని తెలిపారు. వృద్ధాప్యంతో పాటు మానసికంగా కూడా ఆరోగ్యం దెబ్బతినే పరిస్థితికి తీసుకువచ్చిన బ్యాంక్ పాలకవర్గం చర్యలు అత్యంత బాధాకరమని పేర్కొన్నారు.

లారీ డ్రైవర్ అదృశ్యంపై కేసు నమోదు

కృష్ణలంక(విజయవాడతూర్పు): లారీ డ్రైవర్ కనిపించకుండా పోయిన ఘటనపై కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కృష్ణలంక, గుర్రాల రాఘవయ్య వీధిలో కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్న చోడే రమేష్(62) లారీ డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. ఈ క్రమంలో మార్చి 19వ తేదీ రాత్రి అతను తన భార్యతో గొడవపడి బయటకు వెళ్లి వస్తానని చెప్పి సోదరి ఇంటికి వెళ్లాడు. అక్కడ నుంచి లారీ పనికి వెళ్లి వస్తానని సోదరితో చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల, బంధువులు, స్నేహితులను విచారించినా అతని ఆచూకీ లభించలేదు. నాలుగు నెలలైనా తిరిగి ఇంటికి రాలేదు. తన సోదరుడు నాలుగు నెలల నుంచి కనిపించడం లేదని మంగినేడు ధనలక్ష్మి ఆదివారం ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సింహాద్రి పద్మకు పురస్కారం

గుడివాడటౌన్: మహిళా సంక్షేమానికి కృషి చేస్తున్న వ్యక్తులను గుర్తించి సత్కరించడం వారి సేవలకు నిదర్శనమని గాయత్రి మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు ఉమాదేవి అన్నారు. స్థానిక వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థాన ప్రాంగణంలో ఆదివారం తెలుగు భాషా వికాస సమితి ఆధ్వర్యాన అవనిగడ్డకు చెందిన రచయిత్రి సింహాద్రి పద్మను రావూరి భరద్వాజ్ పురస్కారంతో సత్కరించారు.

పశువైద్య కేంద్రం నిర్మించాలి



శిథిలావస్థకు చేరిన వీరపనేనిగూడెం పశువైద్య కేంద్రం

గన్నవరం రూరల్: మండలంలోని వీరపనేనిగూడెం గ్రామంలో పశువైద్య కేంద్రం శిథిలావస్థకు చేరింది. ఈ గ్రామంలో వ్యవసాయం, పశువుల పెంపకం ప్రధాన వృత్తిగా స్థానికులు ఉన్నారు. వీరపనేనిగూడెం గ్రామంతో పాటు తెంపల్లి, మెట్లపల్లి తదితర పరిసర గ్రామాల నుంచి పశువైద్యం కోసం రైతులు ఈ కేంద్రానికి నిరంతరం వస్తుంటారు. స్థానిక గురుకుల పాఠశాల సమీపంలో మెట్లపల్లి వీరపనేనిగూడెం గ్రామం ప్రధాన రహదారి వెంట 50 సంవత్సరాల క్రితం ఈ కేంద్రాన్ని నిర్మించినట్లు స్థానికులు తెలిపారు. అప్పట్లో పెంకులతో దీనిని నిర్మించారు. కాలక్రమంలో ఈ నిర్మాణం శిథిలావస్థకు చేరింది. ఈ కేంద్రం స్థానంలో కొత్తగా భవనం నిర్మించి, పశువైద్యం మరింత మెరుగ్గా పాడి పశువులకు అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. పశువులకు పరీక్షలు చేయటం, అంటువ్యాధులు రాకుండా సీజనల్‌గా టీకాలు వేయటం, యాజమాన్య పద్ధతులు పశుపోషకులకు అందించటం తదితర 19 రకాల పారసేవలను పశుపోషకులకు ఈ కేంద్రం అందిస్తోంది. శిథిలావస్థకు చేరిన భవనం స్థానంలో కొత్తది నిర్మించేందుకు పశుసంవర్ధక శాఖ చర్యలు తీసుకోవాలని పశుపోషకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

రైతుబజార్ ఏర్పాటుకు కసరత్తు

కానూరులో నీటిపారుదల శాఖ స్థలంలో మార్కింగ్

పెనమలూరు: మండల పరిధిలో శాశ్వతంగా రైతుబజార్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు మొదలు పెట్టారు. చాలా కాలంగా ఫుట్‌పాత్‌పై కూరగాయలు అమ్ముకునే వారికి త్వరలో మోక్షం కలగనుంది. వివరాల్లోకి వెళితే పెనమలూరు మండలంలో గతంలో రైతుబజార్ లేక పోవటంతో గత టీడీపీ పాలనలో పోరంకిలో తాత్కలికంగా రైతు బజార్ కూరగాయల విక్రయాలు చేశారు. అయితే అది సక్సెస్ కాలేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతు బజార్ ఏర్పాటుకు రూ.50 లక్షలు మంజూరు చేశారు. కానూరులో పలు స్థలాలు చూడగా స్థానికులు అభ్యంతరం తెలపడంతో పనులు ముందుకు సాగలేదు. దీంతో ప్రజల అవసరాలకు గత ప్రభుత్వం సిద్ధార్థ కాలేజీ యాజమాన్యంతో మాట్లాడి కాలేజీ ఆవరణలో పార్కింగ్ ప్రాంతంలో రైతు బజార్ ఏర్పాటు చేసింది. అయితే గత కొద్దినెలల క్రితం కాలేజీ ఆవరణలో ఉన్న రైతుబజార్‌ను ఖాళీ చేయించారు. దీంతో కూరగాయలు కాలేజీ బయట విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి పక్కన ఫుట్‌పాత్‌పై అమ్మకాలు చేస్తున్నారు.

తాజాగా రైతుబజార్ ఏర్పాటుపై సన్నాహాలు

రోడ్డ పక్కన ఫుట్‌పాత్‌పై కూరగాయలు విక్రయించటంతో ట్రాఫిక్ సమస్యతో పాటు పరిస్థితులు అనువుగా లేవు. దీంతో కాలేజీ దగ్గరలోనే పెట్రోల్‌బంక్ ఎదురుగా ఖాళీగా ఉన్న నీటిపారుదల శాఖకు చెందిన బందరు కాలువ కట్టపై ఏర్పాటు చేయటానికి రంగం సిద్ధం చేస్తున్నారు. గతంలో ఈ ప్రాంతంలో ఆక్రమణలు ఎన్‌హెచ్ఐ అధికారులు తొలగించినా సర్వీస్‌రోడ్డు ఏర్పాటు చేయక పోవటంతో స్థలం ఖాళీగా ఉంది. ఈ స్థలంలో శాశ్వతంగా రైతుబజార్ ఏర్పాటు చేయాలని మార్కెటింగ్ శాఖ అధికారులు కొలతలు కొలిచి, దాదాపు 25 షాపులు ఏర్పాటు చేసేందుకు మార్కింగ్ చేశారు. షాపులు నిర్మించిన తరువాత ఫుట్‌పాత్ పై ఉన్న రైతుబజార్ కూరగాయల అమ్మకాలు ఇక్కడ చేపడతారు. దీని వలన చాలా కాలంగా ఉన్న రైతుబజార్ సమస్యకు పరిష్కారం ఏర్పడుతుంది.

ట్రాఫిక్ సమస్య..

జాతీయ రహదారి పక్కనే నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో రైతుబజార్ ఏర్పాటు చేస్తే ట్రాఫిక్ సమస్య తలెత్తే అవకాశం ఉందని పలువురు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాతంలో తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని మార్కెటింగ్ శాఖ, మున్సిపాలిటీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు కొత్తగా ఏర్పాటు చేసే రైతుబజార్ ఎదురుగా వినియోగదారులను బందరు రోడ్డుపై వాహనాలు నిలపకుండా క్రమపద్ధతిలో వాహనాలు నిలిపేవిధంగా చూడాలి. అదేవిధంగా ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి. మున్సిపాలిటీ కమిషనర్ వెంకటేశ్వరరావు వివరణ ఇస్తూ అన్ని చర్యలు తీసుకుంటామని, రైతుబజార్‌లో వచ్చే వ్యర్థాలు సైతం కాలువలో పడవేయకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటామని పేర్కొన్నారు.



కానూరు ఇంజనీరింగ్ కాలేజీ ఫుట్‌పాత్ పై కూరగాయలు అమ్ముతున్న వ్యాపారులు



కానూరులో ప్రతిపాదించిన స్థలం

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే బోడె ప్రసాద్

కంకిపాడు: పెనమలూరు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. మండలంలోని మారేడుమాక గ్రామంలో సూరపనేని కుటుంబ సభ్యులు వితరణగా ఇచ్చిన స్థలంలో రూ.6.60 కోట్లతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తామన్నారు. పలు చోట్ల విద్యుత్ సబ్‌స్టేషన్లను నిర్మించాల్సి ఉందన్నారు. స్థల సేకరణ చేసి సబ్‌స్టేషన్లను నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. దాతలు మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి తమ కుటుంబం ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. సబ్‌స్టేషన్ నిర్మాణంతో చుట్టుపక్కల 11 గ్రామాలకు మెరుగైన విద్యుత్ సేవలు అందుతాయని, పారిశ్రామికంగా అభివృద్ధి సాధిస్తుందన్నారు. ఈ సందర్భంగా దాతలను ఘనంగా సత్కరించారు. రైతులు పలువురు ఖరీఫ్ వరి నాట్లు సాగుతున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరా వేళల్లో మార్పులు చేస్తే నాట్లకు ఇబ్బంది లేకుండా ఉంటుందని ఎమ్మెల్యేకు విన్నవించారు. కార్యక్రమంలో ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, సర్పంచ్ సీహెచ్ ఆదర్శ కుమార్, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త ముప్పా రాజా, ఏఎంసీ మాజీ చైర్మన్ సుదిమళ్ల రవీంద్ర, విద్యుత్ ఏడీఈ బి.నవీన్‌కుమార్, ఏఈ అశోక్‌కుమార్, తహసీల్దార్ రామకృష్ణ పాల్గొన్నారు.



సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు

రామవరప్పాడు: విధుల పట్ల అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు లభిస్తుందని విశ్రాంత ఐపీఎస్ అధికారి ఎం. రవీంద్రనాథ్‌బాబు అన్నారు. గుణదలలోని నాయీబ్రాహ్మణ విద్యార్థి వసతి గృహంలో ఆదివారం నాయీ బ్రాహ్మణ ఎంప్లాయీస్ సర్వీసెస్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉద్యోగ విరమణ పొందిన పలువురు అధికారులను సన్మానించారు. రవీంద్రనాథ్‌బాబు మాట్లాడుతూ పలు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో తమ విధులను సక్రమంగా నిర్వహించి నేషనల్, ఇంటర్నేషనల్ అవార్డులు పొందిన వారిని సత్కరించడం సంతోషంగా ఉందన్నారు. ప్రస్తుతం పలు రంగాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు ఉన్నతాధికారుల ఆశయాలను, లక్ష్యాలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. నాయీ బ్రాహ్మణ ఎంప్లాయీస్ సర్వీసెస్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించేందుకు సహకరిస్తున్న సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఉద్యోగ విరమణ పొందిన ప్రముఖ వైద్య నిపుణులు జె. నరేష్‌బాబు, కె. నరేంద్రబాబు, ప్రభాకరరావు, ప్రసాదరావును సత్కరించారు. కార్యక్రమంలో స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ ఎం. శ్రీనివాసరావు, ఆర్డీఓ మురళీకృష్ణ, సీఐ ఎంవీఎస్ నాగరాజు, రాష్ట్ర సంక్షేమ సంఘం అధ్యక్షుడు మల్కాపురం కనకారావు, పీవీ రమణయ్య, పీఎస్ఆర్ ప్రసాద్, దాలిపర్తి ధన్వంతరి పాల్గొన్నారు.



నరేష్‌బాబు దంపతులను సన్మానిస్తున్న నాయీ బ్రహ్మణ ఎంప్లాయీస్ సర్వీసెస్ సభ్యులు

మధురంగా సాగిన సినీ సంగీత విభావరి

విజయవాడ కల్చరల్: రాగసుధామయి క్రియేషన్స్ ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన రాగాల పల్లకీ-5 సినీ సంగీత విభావరి మధురంగా సాగింది. నిర్వాహకుడు ఫిరంగి రవి కుమార్ ఆధ్వర్యంలో నిమ్మగడ్డ శేఖర్ వాఖ్యానంతో ఘంటసాల, పీ సుశీల, ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం, ఏసుదాసు, చిత్ర తదితరులు గానం చేసిన గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో గాయనీ గాయకులు భాస్కర్, లెనిన్, అర్జున్, జగదీష్, శ్రీవల్లి, మోహన లక్ష్మి, రమణ, పెద్దిరెడ్డి, లక్ష్మి కందుల, నిషిత, శారదశ్రీ పాల్గొన్నారు.

కౌతా పూర్ణానందం కళా వేదికపై..

భీమవరానికి చెందిన చిప్పాడ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కౌతా పూర్ణానందం కళా వేదికపై ఎన్టీఆర్‌కు స్వరాంజలి పేరుతో ఘంటసాల వెంకటేశ్వరరావు గానం చేసిన గీతాలను నాగేశ్వరరావు, నిర్మల ఆలపించారు. గాయకుడు శ్యాంప్రసాద్, తటవర్తి సూర్యనారాయణ గాయనీ గాయకులను అభినందిస్తూ ప్రసంగించారు.



హనుమంతరాయ గ్రంథాలయంలో సినీ గీతాలను ఆలపిస్తున్న రవికుమార్ బృందం